# చిట్టితల్లి

"ఇంటిల్లిపాదీ ఎలా మాట్లాడినా అందర్ని కన్న పాపానికి భరిస్తూనే ఉన్నాను. తల్లీ! ఇంటికి తొల్చూరి బిడ్డవీ, మీ నాన్నకి గారాల కూచివీ, ఆయనింత జబ్బులో ఉండగా నన్నిలా కాల్చుకు తింటావనుకోలేదే" వరలక్ష్మి సన్నగా వెక్కుతూనే కూతుర్ని మందలిస్తోంది మరో చెవిన పడకుండా!

చిట్టితల్లి ఏం మాట్లాడకుండా మంచం మీద అటు తిరిగి పడుకుని మొఖం కనపడకుండా మోచెయ్యి అడ్డం పెట్టుకుంది. ఈ ఖర్మ ఆడవాళ్ళకే ఎందుకు పెట్టాడో దేవుడు! జన్మహక్కుగా ఏ గోలా లేకుండా దక్కాల్సిన వాటి క్కూడా అడిగో, అర్థించో, దేబిరించో, దోపిడీ చేసో, అల్లరి పడాల్సి వస్తోంది అనుకుంటూ కాళ్ళ దగ్గర్నించి దుప్పటి తలదాకా లాక్కుని గోడవైపు తిరిగిపడు కుని తల్లితో అంది.

"అమ్మా కన్నకూతుర్నయి ఉండీ ఆఖరి దశలో ఆయన మనసు కష్టపెట్టా లంటే నా కెంత బాధగా ఉందో ఎందుకాలోచించవే! నేనేం రాక్షసిని కాదుగా! నువ్వు చెప్పినట్లు మీ గారాల చిట్టితల్లినేగా? మరి నన్నెందుకు ఇలా ఏడి పించడం?" వరలక్ష్మికేం మాట్లాడాలో తెలియక మంచం మీద కూచునే వీపు రాయసాగింది. "పిచ్చిపిల్లా! లేచి మొఖం కడుక్కుని కాఫీ తాగు! తెల్లవార్లూ నాన్న మంచం వదల్లేదు! నీకాపేక్ష లేదని ఎలా అనుకుంటాంరా! లే మరి నాన్నగారు పిలుస్తున్నారు నిన్ను."

ఇంట్లో అందరూ అదోలాటి అయోమయ స్థితిలో ఉన్నారు. రెణ్నెల్ల క్రితం రమణమూర్తి గారికి వంట్లో బాగాలేదని తెలిసి వరంగల్ నించి పెద్దకూతురు చిట్టితల్లి వచ్చేసింది, పిల్లల్ని మొగుడుకీ, అత్తగారికీ అప్పజెప్పి. కాస్త పథ్యం పెట్టాక, వెడదామనుకుంది గానీ కుదరలేదు. ఆయన పరిస్థితి రోజురోజుకీ దిగజారడంతో జెంషెడ్‌పూర్ నించి పెద్దకొడుకూ, అమెరికా నుంచి రెండో కొడుకూ, ఆస్ట్రేలియా నుంచి మూడోవాడు చేరి అప్పుడే మూడు వారాలై పోయాయి. కడుపులో పుండు ఆపరేషన్ చేసే పరిస్థితి లేదని, ఆస్పత్రిలో మందులిచ్చి ఇంటికి పంపేసి పది రోజులైంది. తెరపుమరుపుగా ఉండడం. మెలకువొచ్చినప్పుడల్లా పిల్లల్ని గురించి ఆరాలు తియ్యడం. ఆయన విషయం అటో ఇటో తేలకుండా కొడుకులంతా వెళ్ళిపోతే తిరిగి వచ్చే దూరాల్లో ఎవరూ లేరు. ఏ కూలి బ్రాహ్మడో కక్కుర్తి పడాల్సిందే!

ఎంతైనా తల్లి ప్రాణం కదా! కూతురలా పట్టుబట్టడం వల్ల ఎవరిచేత ఏం మాటలు పడుతుందోనని దిగులు వదల్లేకపోతోంది.

"ఇలాంటి టైంలో నాన్నని విల్లు రాయమనడం ఏం పద్ధతి? నీకేం తక్కువ చేశాం చెప్పు! పెళ్ళి సంబంధాలు వెతకడానికే ఎన్ని అవస్థలు పడ్డామో మర్చి పోయావా అప్పుడే! లక్షదాకా కట్నం ఇచ్చామా? పది కాసుల బంగారం పెట్టామా? మళ్ళీ ప్రతి సంక్రాంతికి బట్టలు పెడుతున్నామా మీ అందరికీ! ఆడపిల్లకంతకన్నా ఏం ఇస్తాం?

"అమ్మా! నా కర్మకొద్దీ నాకు నాన్నగారి చక్కదనమూ, నీ తెలివితేటలూ వచ్చాయి. చదువా అంటలేదు. మూడు ముళ్ళేయడానికి స్కూలు మాస్టరే లక్ష పుచ్చుకున్నాడు. అది నాకిచ్చినట్టా? మరలా అయితే లక్షలు ఖర్చుపెట్టి తమ్ముళ్ళని డాక్టర్లనీ ఇంజనీర్లనీ చెయ్యలేదా? ఆస్ట్రేలియాలు, అమెరికాలు పంపలేదా? బాగా డబ్బు సంపాయిస్తున్నారనీ మగపిల్లలనీ నీ కెంత సేపు తమ్ముళ్ళేగానీ ఎప్పుడో పుట్టి అవతలకెళ్ళిపోయిన నా సంగతి పట్టదు! తల్లి క్కూడా పక్షపాతం ఉంటుందంటే ఇది వరకు నమ్మేదాన్ని కాదు. ఇప్పుడు నిజమనుకోవాల్సొస్తోంది" మళ్ళీ వెక్కడం మొదలుపెట్టింది చిట్టితల్లి.

"అందగాళ్ళనీ, సంపాదనపరులనీ కాదమ్మా నేను వాళ్ళ పక్షం మాట్లాడేది. కాస్త నా పరిస్థితి అర్థం చేసుకో! రేపు వాళ్ళ పంచన వెళ్ళాల్సిందే కదా నా బతుకు! కూతురైనా అర్థం చేసుకుంటుందనుకున్నాను. నువ్వు నీ మరదళ్ళని మించిపోతున్నావు."

"అమ్మా! నీకు మొహమాటం లేదుటే అలా మాట్లాడేందుకు? మరదళ్ళ పంచలో బతకాల్సిన ఖర్మ నీకేమిటి? నాన్నగారిని అయిదు వాటాలెయ్యమను. మన అదృష్టం కొద్దీ మూడు లక్షలు పెట్టి మీరు కట్టిన ఇల్లు ఇప్పుడు ఏభై దాకా వస్తుంది. నీ వాటా నువ్వు హాయిగా నీ ఇష్టం వచ్చినట్లు అనుభవించు! తర్వాత ఏ శరణాలయానికో ఇచ్చేయి. అయినా నీ చేతిలో పైసలుంటే మర దళ్ళు ప్రేమగానే ఉంటారులే" ఇంకా గోడవైపుకి తిరిగి కూతురు, కాళ్ళ దగ్గర తల్లి కూచుని మాట్లాడుకుంటూనే ఉన్నారు.

"మా అమ్మగా! పసుపు కుంకం కింద రెండు లక్షలిస్తానంటున్నాడు వాసు. నువ్వు సంతకం పెట్టేస్తే ఆ వ్యవహారాలన్నీ వాళ్ళ మావగారికి అప్పచెప్పి వెళ్ళి పోతాడట - నిన్న రాత్రి అమెరికా నించి మళ్ళీ ఫోనొచ్చింది. కంట్రాక్టరొకడు అగ్రిమెంటు కోసం తిరుగుతున్నాడు!"

ఠక్కున మంచం మీద లేచి కూచుంది. "పసుపు కుంకంట! నేనేం పసుప్పూసుకోను. కుంకం పెట్టుకోను. బొట్టుబిళ్ళలిమ్మను. అయినా బోడి వెధవలు వాళ్ళిచ్చేదేవిటి? ఇదంతా నాన్నగారి ఆస్తి. ఆ వెధవల కెంతొస్తే నాకూ, నీకూ కూడా అంతే రావాలి. నీకు కొడుకుల్ని చూస్తే బుర్ర పనిచేయదు. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టేస్తావు. అందుకే నాన్నచేత విల్లు రాయించమంటున్నాను. నీ కర్థమై చావట్లేదు."

మళ్ళీ వరలక్ష్మికి గబుక్కున ఏదో గుర్తొచ్చింది. "అన్నట్లూ! నిన్న సుధ చెప్తోందే! నీ పెళ్ళెప్పుడో అయిందిట కదా! అలాటప్పుడు సమాన హక్కుండదుట కదా!"

"మరి చూశావా! వాళ్ళ ఆలోచనలెలా ఉన్నాయో? కోర్టుకెడితే చచ్చినట్లిస్తారని ఆపాటి నాకు తెలుసు. కాకపోతే ఆస్తి కోసం తమ్ముళ్ళ మీద కోర్టుకెళ్ళిందని బతికినన్నాళ్ళూ నింద మోయాలి నేను."

"చూడు తల్లీ! నేను చెప్పాల్సిందేదో చెప్పాను. పుట్టిల్లుని ఎప్పుడూ కాదనుకోకూడదు. మనం అంతా తాతగారింటి కెళ్ళినప్పుడు మావయ్యలూ, అత్తయ్యలూ ఎంత ప్రేమగా ఉండేవాళ్ళో గుర్తులేదూ! ఇప్పటి క్కూడా ప్రతిసారీ అమ్మమ్మ పేరు చెప్పి నాకే కదా పెడతారు పట్టుచీర!"

"ఇంకా నయం! పోలేరమ్మ పేరు చెప్పి పెట్టరు! అమ్మా నాకు చాలా విసుగ్గా ఉంది. నన్ను మాట్లాడించొద్దు. అందరి ముందూ వాగివాగి చెడ్డదాన్నని పించుకోవడం నాకిష్టం లేదు. ఎవరికీ తెలియకుండా నువ్వే నాన్నగారికి చెప్పు. నా పేరుగాని బయటికి తెలిస్తే నేనిప్పుడే మా ఊరెళ్ళిపోతా. ఇంక నువ్వెళ్ళు. నాన్న పిలుస్తున్నారు" అని మళ్ళీ గట్టిగా ముసుగెట్టింది.

అక్కడున్న ఖాళీ గ్లాసులన్నీ వంటింట్లో పడేసి మళ్ళీ రమణమూర్తి గారి మంచం దగ్గరికి నడిచింది.

"ఎవరూ? తెల్లారి చిట్టి కనిపించలేదేం?" నీరసంగా వస్తోందాయన మాట.

"వస్తుంది! రాత్రంతా మీ మంచం పక్కనే కూచుందిగా! మాగన్ను పడ్డట్టుంది."

"రాఘవా! వాణీ..."

" ఆ! వస్తారు. వాణీ వాళ్ళమ్మ గారింట్లో కదా వాళ్ళ మకాం! స్నానాలవీ చేసి ఇంకాసేపట్లో చేరతారు. మరి మనం ఇంతమందిమి ఇరుకు కదాని అక్కడే ఉంటున్నారు. రసం ఇవ్వనా?"

"వద్దు. నిమ్మ తొనియ్యి. అయినా ఇదేమన్నా పెళ్ళివారిల్లా! వాసు, సుధ కనిపించి రెండు రోజులైంది.

"వాళ్ళిద్దరూ తిరపతీ బెంగుళూరు వెళ్ళారుగా! రేప్పొద్దునకల్లా వస్తారు. ఇందాక వాడు ఫోను చేశాడు. మీరెలా ఉన్నారని అడిగాడు."

"ఇంకా పోలేదని చెప్పలేకపోయావా?"

"ఏం మాటలండీ అవి. పెళ్ళయి వెళ్ళాక మరిదేకదా రావడం. మొక్కన్నా తీర్చుకోలేదు. కోడలి పుట్టింటారు బెంగళూర్నించటు తిరుపతి వచ్చార్ట. వాళ్ళ పిల్ల మీద వాళ్ళకి బెంగ ఉండదా మరి! ఇక్కడుండి మాత్రం ఏం చేస్తారు? మీరు మాట్లాడకుండా రెస్టు తీసుకోండి."

"ఇంకంతా రెస్టేలే. చిట్టిని పిలు."

"వస్తుంది. మాట్లాడకండి. మీరిలా ఉన్నారని పాపం పిల్ల తగని బెంగపడు తోంది. నేనే కాసేపలా నడుం వాల్చమని పంపించా! నే ఇక్కడే ఉన్నాగా మాట్లాడుతూ ఉంటా! మీరు ఊ కొట్టండి. ఎక్కువ హైరానా పడద్దంటున్నారు కదా డాక్టర్లు!

"ఊ"

మరేమో నిన్న రాత్రి అల్లుడు ఫోన్ చేశాడు చిట్టితల్లికి. వాళ్ళింట్లో చిన్నప్ప ట్నించీ ఉండి చదువుతున్న కుర్రాడూ రామం అని ఉండేవాడు జ్ఞాపకం ఉందా!

"ఆ"

"వాడికి టెన్త్ పరీక్షలైపోయాయట. ఇక్కడికి పంపిస్తాట్ట. మనిద్దరం పెద్దవాళ్ళమైపోయాం కదా! కాస్త చేతికింతాసరా ఉంటాడని. అన్నం పెడితే చాలు. వేరే ఏం అక్కర్లేదు! ఇక్కడే ఉంటూ ఇంటరు ప్రైవేటుగా చదువుకుంటా డట పంపమని చెప్పింది."

"మంచిది. పెద్దాడేడీ ముకుందం?"

"మీరు మాట్లాడకుండా నే చెప్పింది వింటూ ఊఁ కొట్టమన్నానా! ఆ కంట్రాక్టరు తొందర పెడుతున్నాడంటేనూ కలిసొస్తానని వెళ్ళాడు."

"వాడ్నెందుకు తొందర పెట్టడం! నన్ను పెట్టాలిగానీ."

"అదిగో అలాగే మాట్లాడద్దన్నానా. మరిప్పుడీ ఇల్లు మనమేమో అద్దెల కిచ్చేందుక్కూడా వీల్లేకుండా కట్టుకున్నాం గదా. అటుపక్క ఆరు కొబ్బరి చెట్లూ,

రెండు మామిడి చెట్లూ కొట్టేసి, ఫ్లాట్లేస్తే పదహారు వస్తాయట. మనకి నాలుగు ఫ్లాట్లు పది లక్షల రొక్కం ఇస్తానంటున్నాట్ట. వీళ్ళు మూడు ఫ్లాట్లు ఇరవై లక్షలూ ఇవ్వమంటున్నారు. అదీ గొడవ.

"బానే ఉంది. మరి ..."

"మీకేం అవదు. మీరు అనవసరంగా అపశకునం మాటలనకండి. వాళ్ళేదో ఫ్లాట్లనుకుంటున్నారంటే మీకేదో అయిపోతుందని కాదు. వాళ్ళే చెప్పారు. 'అమ్మా! నువ్వూ నాన్న ఓ ఫ్లాట్‌లో ఉండి మిగతా రెండూ అద్దెలకిస్తే హాయిగా బతకవచ్చు. మీరు చాలీచాలని పెన్షన్‌తో ఇబ్బంది పడద్దూ' అని ఇద్దరూ చెప్పారు. మరి మనం అంటే ఏ ఆపేక్షా లేకుండానే మనకోసం ఇంత కష్టపడు తున్నారా?"

"ఏడిశావులే! నువ్వెళ్ళి దాన్ని పంపించు." కాసేపటికి స్నానం చేసి చిట్టి తల్లొచ్చి తండ్రి పక్కన కూచుంది.

"అల్లుడు మనకోసం రామాన్ని పంపిస్తానన్నాడా?"

"అవున్నాన్నా! మీ ఇద్దరికీ చేతిలో ఎవరో ఓ కుర్రాడు లేకపోతే కష్టమని రామాన్నడిగారట. రేపో ఎల్లుండో వస్తాడు. తమ్ముళ్ళంతా వెళ్ళిపోతారు గదా నాల్రోజుల్లో. నేనింకో నెల్లాళ్ళుంటాలెండి. పిల్లల్ని కూడా రామంతో పంపిస్తా నన్నారు. ఈ ఊరు ట్రాన్స్ఫరు చేయించుకుందామనుంది గానీ ఈ ఖర్చులు భరాయించలేం నాన్నా!"

"మరీ .... ఒక విషయం నీ గురించీ."

"ఎక్కువ మాట్లాడకండి నాన్నా! మళ్ళీ ఆయాసం వస్తుంది! మేం చూసు కుంటాం గదా. నా గురించి దిగులు పడకండి. ఎక్కువ సంపదల్లేవేమో గానీ నాకు దేనికీ లోటులేదు నాన్నా."

"పిచ్చితల్లీ! అల్లుడు బంగారం. నాకేం దిగుల్లేదులే" మళ్ళీ కళ్ళు మూసు కుని పడుకున్నారు.

కానీ మంచం మీదున్న రమణమూర్తి గారు ఎవరినీ ఎక్కువ ఇబ్బంది పెట్టలేదు. ఎవరికీ సెలవులు పొడిగించాల్సిన అవసరం రాకుండానే, మనసుల్లో మెసిలే భయాలు మాటలుగా మారకుండానే అందరి ఆపేక్షలూ, గౌరవాలూ పదిలంగా ఉండగానే ఓ రాత్రి సునాయాసంగా పైలోకాలకి వెళ్ళిపోయారు. కంట్రాక్టరు చుట్టూ తిరుగుతున్న పెద్దవాడూ, ఇక్కడున్న వసతులు చాలక

అత్తారింట్లో మకాం పెట్టి రోజూ వచ్చి పోతున్న రెండోవాడూ, బెంగుళూరులో మనుగుడుపులకెళ్ళిన మూడోవాడూ అందరూ చేరి ఆయన్ని లోపం లేకుండా తలొక కొమ్మూ పట్టేశారు. కుటుంబం అంటే అలా ఉండాలని ఓహో అని పించేలా పన్నెండు రోజులూ పన్నెండు నిమిషాల్లా జరిపించేశారు. పన్లో పనిగా ఈయన సంగతటు తేలగానే అమెరికా, ఆస్ట్రేలియా, జంషెడ్‌పూర్ టిక్కెట్లన్నీ ఖాయం కూడా చేసుకున్నారు. అందర్నీ ఇలాగే కలిసిమెలసి అన్యోన్యంగా ఉండమని తోడు నీడగా బతకమని ఆశీర్వదించి చుట్టాలంతా రైలెక్కేశారు. ఒక్క శంకరం మాత్రం పిల్లలందరూ ఉన్నన్నాళ్ళూ ఉంటానని ఉండిపోయాడు.

శంకరం అంటే రమణమూర్తి గారికి పెత్తండ్రి కొడుకు. శంకరం గారి తల్లే వీళ్ళిద్దర్నీ పెంచింది. అందుకే ఒక్క తల్లి కడుపున పుట్టకపోయినా అంతకన్నా ఎక్కువ ఆపేక్షగానే ఉంటారు. హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకోడానికి సరిపల్లె పొలాలమ్ముకునే వరకూ రమణమూర్తి గారి పొలాలని శంకరం గారే చూసే వారు.

చిట్టితల్లీ, వరలక్ష్మీ శంకరం గారి దగ్గర కూచుని ఎప్పటెప్పటి సంగతులో నెమరేసుకుంటూ కళ్ళు తుడుచుకుంటున్నారు. మధ్యాహ్నం భోజనాలై పోయాయి కదా మనసేం బాగోలేదని మూడోవాడూ కోడలూ సినిమాకని బయ ల్దేరుతున్నారు. మేమూ వస్తామని మిగతా పిల్లలూ, వాళ్ళని ఆపలేక తల్లులూ ఒకటే గోల. ఈ మధ్యలో ఉన్నవాళ్ళు చాలరన్నట్లు ఇంట్లో ఇంతపాటు జరి గిందని కాస్త మర్యాదన్నా లేకుండా ఆ కాంట్రాక్టరు దస్తావేజులో అంటూ వచ్చి వరండాలో కూచున్నాడు. విషయం ఎలా మొదలుపెట్టాలో, ఎక్కడ మొదలు పెట్టాలో తెలియక ముకుందం ఒకటే కొట్టుమిట్టాడుతున్నాడు. చివరికి తెగించి పినతండ్రి దగ్గరికి ఓ మోడా లాక్కుని కూచుని మొదలుపెట్టాడు.

“బాబాయ్! నిన్నటితో అన్ని కార్యక్రమాలూ అయిపోయాయి. అన్ని బాధ్యతలూ నా మీద పడేసి ఒక్కమాటన్నా చెప్పకుండా వెళ్ళిపోయారు. ఒక్క సారంటే ఒక్కసారన్నా పిల్చి పలకరిస్తారేమోనని ఎంత ఎదురు చూశానో!”

“ఆఖరి రోజున రెండు మూడుసార్లడిగారురా! నువ్వేమో డెవలప్‌మెంట్ వాడితో మీటింగుందని సాయంత్రం వరకు రానేలేదు” చనిపోయిన భర్తని వెనకేసుకొచ్చింది వరలక్ష్మి.

“కాదులే ముకుందం. పైకి తెలిస్తే వదిన బాధపడుతుందని లోలోపల ఎంత బాధ అనుభవించాడో, చివరి ఆర్నెల్లూ నరకమే అనుకో. కాస్త నువ్వొస్తే

తల్లికి అండగా ఉంటావనీ ఆశపడ్డాడు. దూరాన ఉన్న వాళ్ళెటూ రాలేరు. వీడన్నా ఒక్కసారి రాకూడదా అని నాతో కూడా అన్నాడురా!"

"మా బాధలెవరికి తెలుస్తాయిలే బాబాయ్. ఇప్పుడు మేం ఏమన్నా బాగుం డదు. ఆయన వప్పుకున్నా వప్పుకోకపోయినా పెద్ద కొడుకుగా నాకు బాధ్యత లెటూ తప్పవు. ముగ్గురం మాకు చేతనైనట్లుగా లక్ష రూపాయలు ఖర్చుపెట్టాం. నువ్వే చూశావుగా ఈ పదిహేను రోజులూ. మరి తమ్ముళ్ళు అంతంత దూరా ల్నించి కుటుంబాలతో సహా సెలవులు పెట్టి వచ్చారంటే ఆలోచించు ఎంత ఖర్చయి ఉంటుందో! అక్కంటే గంట దూరంలో ఉంది. దానికి మల్లే ప్రతి శనివారం వచ్చి కనపడలేదంటే మాకెలా కుదురుతుంది?"

పోనీలే! ఇప్పుడవన్నీ ఎందుకు? అన్నీ సక్రమంగా జరిగిపోయాయి. ఇంక అమ్మని మీరందరూ ఎటూ జాగ్రత్తగానే చూసుకుంటారు. ఇంటి ఆడపడుచు మీ అందరంత హోదాలో లేదు. మరి అక్కని కనిపెట్టి ఉండాలి. అంతకన్నా బయట వాడిని ఏం చెప్తాను!"

"అదే బాబాయ్! లంకంత ఇంట్లో, అమ్మని ఒక్కదాన్నీ వదిలి ఎలా వెళ్ళం? డెవలప్‌మెంట్‌కి ఇచ్చేద్దామని ముగ్గురం ఓ నిర్ణయానికి వచ్చాం. వాడు మూడు ఫ్లాట్‌లు, ఇరవై లక్షలు క్యాష్ ఇచ్చేందుకు వప్పుకున్నాడు. పెద్దవాడివి నీ ముందే చెప్తున్నా! అక్కకి అన్యాయం చేసే ప్రశ్నేలేదు. తనకి రెండు లక్షలు క్యాష్ ఇస్తాం. అమ్మ పేర మా ముగ్గురి పేర కలిపి అయిదు లక్షలు బ్యాంకులో ఫిక్సెడ్ వేస్తాం. వాసు ఫ్లాట్‌లో అమ్మని ఉండమంటున్నాడు. ఆ విషయం మేం ముగ్గురం చూసుకుంటాం. వాడు ఇండియా తిరిగొచ్చేస్తే అప్పుడు అమ్మ విషయం ఆలోచించవచ్చు. ఎలాగూ ఇంకా సగం పెన్షను వస్తుంది కదా! అదీ, ఈ వడ్డీ కలిపి అమ్మ హాయిగా ఉండచ్చు. నువ్వు కూడా ఈ పద్ధతి బానే ఉందనుకుంటే బిల్డర్‌ని పిలుస్తా. ఎటూ అక్కా బావా కూడా సంతకాలు చెయ్యాలి కదా!

చిట్టితల్లేం మాట్లాడలేదు. ముభావంగా కూచుని ఏదో మేగజేన్ తిర గేస్తోంది. ఇంటల్లుడు పిల్లలందర్నీ చేరేసి క్విజ్ కార్యక్రమం నిర్వహించడంలో మునిగిపోయున్నాడు. హఠాత్తుగా శంకరం గారు వరలక్ష్మికేసి తిరిగి "వదినా! అన్నయ్య నీకేం చెప్పాడో నాకు తెలియదు! సరిపల్లె వచ్చినప్పుడు నాకు చాలా విషయాలు చెప్పాడు. ఎంతో టైం లేదని ఆర్నెల్ల క్రితమే డాక్టర్లు చెప్పారుట."

"ఆయనేది నాతో సరిగా చెప్పారు గనక! పోన్లే చెప్పకపోబట్టే ఈ అర్నెల్లూ ఆయనకి ఎంతో ఆశగా ఉపచారాలు చేశాను" అని నిట్టూర్చింది.

"ముకుందం, నన్ను క్షమించరా! పిల్లలు మాట్లాడే వరకూ రహస్యంగా ఉంచమని ప్రమాణం చేయించుకున్నాడురా నాన్న. విల్లురాసి రిజిస్ట్రారు ఆఫీసులో ఉంచి కాపీ ఒకటి సీల్డ్ కవర్లో పెట్టి నాకిచ్చాడు. వదిననే తెరవ మన్నాడు" అంటూ పెద్ద కవరు ఆవిడ చేతిలో పెట్టాడు.

అలిసిపోయి గదిలో నడుం వాల్చిన పెద్ద కోడలూ, సినిమాకని తయారవు తున్న జనాభా, పేకాటలో డ్రాప్ చేసిన పిల్లలూ ఒక్కొక్కళ్ళే విల్లనేసరికి హాలు లోకి చేరారు.

విల్లు ఎవరూ పైకైతే చదవలేదు గానీ ఒకళ్ల చేతుల్లోంచి ఒకళ్ళు లాక్కుని చదివి మాట్లాడకుండా గదుల్లోకి వెళ్ళిపోయారు. చివరికక్కడ మిగిలింది చిట్టి తల్లీ, వరలక్ష్మి శంకరం, ముకుందమూను.

"పోనీలే అమ్మా! నాన్నగారు నాకన్యాయం చెయ్యలేదు. మనిద్దరి గురించి ఎంత ఆలోచించారో చూడు! ఇంక కంట్రాక్టర్లు రానక్కర్లేదని తమ్ముళ్ళకి చెప్పు. దీన్నేదన్నా చేసే హక్కు నీకూ లేదు ... ప్రస్తుతానికి నాకూ లేదు."

"వదినా మగపిల్లలకన్యాయం చేశానని మీరు అనుకుంటారేమోనని భయ పడి మీతో చెప్పలేదు. ఇంత హోదాగా బతికిన నా భార్య కోడళ్ళ మెహర్బానీలో బతకడం ఎలా భరించాలిరా అని బాధపడ్డాడు. పోనీ మీ పేర పెడితే మగ పిల్లలు మీ మీద అలుగుతారని తెలుసన్నాడు. వెంటనే రూపాంతరం చెందు తుంది కాబట్టి ఆ పిచ్చిదాని పేర్న రాయకూడదన్నాడు. అందుకే మీరున్నంత వరకూ మీకు, తర్వాత చిట్టితల్లికీ అని రాశాడు."

"చిట్టితల్లికి అన్యాయం జరిగిందని రోజుకోసారైనా బాధపడేవారు శంకరం. ఎట్లాగూ చిన్నవాళ్ళిద్దరూ దేశంలోనే లేనప్పుడు వాళ్ళకి ఇక్కడ ఇల్లు మాత్రం దేనికి? అమ్ముకుందామంటే ఈ రూపాయలూ అక్కడ చెల్లవు. ముకుందానికి రావల్సింది వాడామధ్య ప్లాటు కొనుక్కున్నప్పుడు ఎప్పుడో ఇచ్చేశారు కదా! ఇక చిట్టితల్లి విషయం. ఇప్పుడు మా పేరు చెప్పుకుని ఆడపిల్ల చల్లగా కాపురం చేసుకుంటుంది."

చివరికి మాట్లాడాడు ముకుందం "ఆస్తి ఇవ్వలేదని బాధలేదు కానీ ఎఫ్‌డిఆర్‌లు కాన్సిలు చేసి కర్మకాండలకైన డబ్బు కూడా రెడీ పెట్టుకుంటారని అనుకోలేకపోయాం బాబాయ్! పోనీలే, అమ్మ తర్వాత అక్క ఎప్పటికీ మాకీ ఇల్లూ, కొబ్బరి చెట్లూ, మామిడి చెట్లూ .. అచ్చంగా మన కోసం ఉంటాయను కున్నార్లే!"

విల్లురాసి మరీ కన్నుమూసిన రమణమూర్తిగారు ఎవరి నెత్తినా ఏ బాధ్య తలూ పెట్టలేదని తెలుసుకున్న కొడుకులూ కోడళ్ళూ చిన్నబుచ్చుకున్నారు. కానీ, ఒక్కసారి చిట్టితల్లి మాత్రం తనకి- కొత్తగా అమ్మహోదా వచ్చినట్లు మురిసి పోయింది.

-మార్చి 2002, పత్రిక మన మాసపత్రిక

✦ ✦ ✦